ఎంవీఆర్ కళాశాలకు నాక్ గుర్తింపు


నాక్ గుర్తింపు పత్రాన్ని వీసీకి చూపుతున్న రామారావు

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం అనుబంధంగా గాజువాకలో నిర్వహిస్తున్న ఎం.వి.ఆర్ డిగ్రీ కళాశాలకు నాక్ బీ ప్లస్ ప్లస్ ర్యాంకు లభించడంపై ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాదరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ వి.రామారావు నాక్ సర్టిఫికెట్‌ను వీసీ ప్రసాద రెడ్డికి శనివారం తన కార్యాలయంలో చూపించారు. అనుబంధ కళాశాలలు నాణ్యత ప్రమాణాలను నిలుపుకొని, నాక్ గుర్తింపును సాధించడం హర్షణీయమన్నారు. అనంతరం కళాశాల నూతన సంవత్సరం క్యాలెండర్‌ను వీసీ ప్రసాదరెడ్డి ఆవిష్కరించారు.

రోడ్డు భద్రతా నియమాలు తప్పనిసరి

అగనంపూడి: రోజురోజుకూ నగరంలో ట్రాఫిక్ రద్దీ పెరుగుతున్న పరిస్థితుల్లో భారీ వాహనాల డ్రైవర్లు అప్రమత్తంగా వ్యవహరించాలని విశాఖ డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ రాజారత్నం సూచించారు. దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్, ఫార్మా, మేనేజ్‌మెంట్ కళాశాలలు, పాఠశాల బస్సుల డ్రైవర్లకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ వేగం నియంత్రించుకొని సురక్షితంగా గమ్యాన్ని చేర్చడానికి ప్రతీ డ్రైవర్ జాగ్రత్తతో వాహనాలు నడపాలన్నారు. విజ్ఞాన్ సీఈఓ శ్రీకాంత్, ఎంవీఐ సత్యంనాయుడు, ఫార్మా, ఇంజనీరింగ్ కళాశాలల ప్రిన్సిపాల్స్ వై.శ్రీనివాసరావు, బి.అరుంధతి, మాధురి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీటీసీ రాజారత్నం

కొత్త వత్సరానికి కోటి ఆశలతో..

- యువత స్వాగత గీతిక
- రంగవల్లులతో అతివల ఆహ్వానం
- కిటకిటలాడిన బేకరీలు, బిర్యానీ పాయింట్లు
- గాజువాకలో మిన్నంటిన సంబరాలు

గాజువాక: రంగుల రంగవల్లికలు.. చిన్నారుల సంబరాలు.. యువత కేరింతల నడుమ నూతన సంవత్సరానికి గాజువాక ఘన స్వాగతం పలికింది. గతించిన సంవత్సరంలో జ్ఞాపకాలను హృదయాంతరాల్లో నిక్షిప్తం చేసుకొని 2022కు వీడ్కోలు పలికింది. కోటి ఆశలతో కొత్త సంవత్సరాన్ని స్వాగతించింది. ఈ సందర్భంగా సంబరాలు అంబరాన్ని తాకాయి. అపార్ట్‌మెంట్లు, నివాస ప్రాంతాల్లో ఆనందోత్సాహాలతో కొత్త సంవత్సరానికి ఘనంగా స్వాగతం పలికారు. వివిధ హోటళ్లలో నూతన సంవత్సర వేడుకలను నేత్రపర్వంగా నిర్వహించారు. లైవ్ మ్యూజిక్‌తో కూడిన కార్యక్రమాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో హుషారెత్తించారు. పలుచోట్ల ఆధ్యాత్మిక కార్యక్రమాలతో నూతన సంవత్సరాన్ని ఆహ్వానించారు. చర్చిలు, దేవాలయాలు, ప్రార్థనా మందిరాల్లో శనివారం అర్ధరాత్రి వరకు ప్రత్యేక ప్రార్థనలు, పూజలు చేశారు. ఈ వేడుకల్లో అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు ఎక్కడికక్కడ బందోబస్తు ఏర్పాటు చేశారు.



బేకరీ వద్ద సందడి

సందడే సందడి..

పెదగంట్యాడ: నూతన సంవత్సరాన్ని స్వాగతిస్తూ శనివారం సాయంత్రం మండలంలోని ప్రధాన ప్రాంతాలన్నీ సందడిగా కనిపించాయి. బేకరీలు, బిర్యానీ పాయింట్లు, రంగుల దుకాణాలు కిటకిటలాడాయి. యువత కేరింతలతో పాత ఏడాదికి గుడ్‌బై చెప్పారు.. కొత్త సంవత్సరాన్ని కేక్‌లు కట్ చేసి స్వాగతం పలకగా.. మహిళలు తమ ఇళ్ల ముందు రంగుల రంగవల్లులతో ఆహ్వానించారు. చేదు జ్ఞాపకాలను చెరిపివేస్తూ.. మధుర క్షణాలను నెమరువేసుకున్నారు. కొత్త సంవత్సరం కొత్త ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు. అంతా బాగుండాలంటూ ఆలయాలకు వెళ్లి పూజలు చేశారు.



నడుపూరులో రంగుల రంగవల్లులు



గాజువాకలో నూతన సంవత్సరాన్ని స్వాగతిస్తూ..

క్లుప్తంగా

7, 8 తేదీల్లో లంబసింగి ఫ్యామిలీ క్యాంప్

ఉక్కునగరం: యూత్ హాస్టల్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈ నెల 7, 8 తేదీల్లో లంబసింగి ఫ్యామిలీ క్యాంప్ ఏర్పాటు చేశామని యూత్ హాస్టల్స్ ప్రతినిధులు తెలిపారు. జనవరి 7న మధ్యాహ్నం ఒంటి గంటకు సెక్టార్–2లోని ఓల్డ్ హెల్త్ సెంటర్ వద్ద బస్సు బయల్దేరుతుందని తెలియజేశారు. సాయంత్రం 4 గంటలకు లంబసింగి చేరుకుంటామని, అక్కడ స్ట్రాబెర్రీ తోటల సందర్శన ఉంటుందని చెప్పారు. రాత్రి క్యాంప్ ఫైర్ అనంతరం అక్కడే బస ఏర్పాటు చేశామని తెలిపారు. జనవరి 8న ఆదివారం తెల్లవారుజామున 4.30 గంటలకు వ్యూ పాయింట్ విజిట్, 10 గంటలకు సమ్మగిరి వాటర్ ఫాల్ సందర్శన ఏర్పాటు చేశామన్నారు. భోజనం తర్వాత తిరుగు ప్రయాణం ఉంటుందని తెలియజేశారు. ఆసక్తి గలవారు వి.ఆర్.కె. రాజును 98490 43455 నంబర్‌లో, పి. శ్రీనివాసరావును 89850 80595 నంబర్ ద్వారా సంప్రదించాలని కోరారు.

పేదలకు వస్త్రాల పంపిణీ



పేదలకు వస్త్రాలు అందజేస్తున్న కృష్ణారావు తదితరులు

పెదగంట్యాడ: ఇండియన్ బాడీ బిల్డర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ సవలాపురపు రాజారావు ఆర్థిక సాయంతో దుర్గవానిపాలెంలోని సత్య హెల్త్ కేర్ జిమ్‌లో పేదలకు శనివారం వస్త్రాలు పంపిణీ చేశారు. స్టీల్‌ప్లాంట్ బీఎఫ్ డిపార్ట్‌మెంట్ జనరల్ మేనేజర్ కృష్ణారావు చేతులమీదుగా ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మార్టుపూడి పరదేశి, ఎస్‌బీ యాదవ్, అప్పలరెడ్డి, సుందర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అనాథ బాలలతో ఆటపాట



బాలలతో స్కౌట్స్ అండ్ గైడ్స్

పెదగంట్యాడ: అనాథ బాలల్లో ఆనందోత్సాహాన్ని నింపారు హిందూస్థాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్. స్ఫూర్తి అనాథాశ్రమం నుంచి సుమారు 70మంది చిన్నారులను శనివారం నడుపూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌కు తీసుకువచ్చి, ఆటపాటలతో ఉత్సాహపరిచారు. వివిధ రకాల పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు. చిన్నారులకు రాతసామగ్రి అందించారు. మధ్యాహ్నం భోజనాలు సమకూర్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నారాయణరావు, మంగమ్మ, శ్రీదేవి, ప్రశాంత్, వరలక్ష్మి, విజయ, సత్యవతి పాల్గొన్నారు.

నూతన నియామకం



బొట్ట ముత్యాలరావు

అగనంపూడి: వైఎస్సార్ సీపీ 88వ వార్డు యువజన విభాగం అధ్యక్షునిగా బొట్ట ముత్యాలరావు నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం పార్టీ అధిష్టానం నుంచి వచ్చిన నియామక ఉత్తర్వులను పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ చేతుల మీదుగా అందుకున్నారు. తనకు ఈ అవకాశం కల్పించేందుకు సహకరించిన ఎమ్మెల్యే అదీప్‌రాజ్‌కు, వార్డు అధ్యక్షుడు గండ్రెడ్డి మహాలక్ష్మి నాయుడుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

క్రమశిక్షణే విజయానికి సోపానం



సదస్సులో మాట్లాడుతున్న బాలాజీ

పెదగంట్యాడ: యువశక్తి అణుశక్తి కన్నా విలువైనదని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు బాలాజీ అన్నారు. క్రమశిక్షణే విజయానికి సోపానమని చెప్పారు. నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై శనివారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. సంకల్పం ఉంటే ఏదైనా సాధించవచ్చన్నారు. విద్యార్థి దశలోనే లక్ష్యాలను నిర్దేశించుకోవాలని సూచించారు. హెచ్‌ఎం రాచకొండ శ్రీనివాస్, ఈశ్వరరావు, నారాయణరావు, అప్పలరాజు, శివ, బాబ్జీ పాల్గొన్నారు.

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

పెదగంట్యాడ: కొత్త సంవత్సరంలో నియోజకవర్గ ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ఆకాంక్షించారు. వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మార్టుపూడి పరదేశి ఆధ్వర్యంలో స్థానిక బీసీ రోడ్డులోని టీఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో నూతన సంవత్సర వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఆయన కేక్ కట్ చేసి అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలను పూర్తి స్థాయిలో అమలు చేస్తూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల హృదయాల్లో నిలిచిపోయారన్నారు. నియోజకవర్గంలో ఈ ఏడాది చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలు ఒక కొలిక్కి వచ్చాయని, వచ్చేఏడాది మరిన్ని కార్యక్రమాలతో దూసుకుపోవడం ఖాయమని అన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ పల్లా చినతల్లి, రాజాన వెంకటరావు, రెడ్డి జగన్నాథం, గొందేశి శ్రీనివాస్‌రెడ్డి, నక్క వెంకటరమణ, మహేశ్‌రెడ్డి, గొందేశి సత్యారావు, మంత్రి శంకరనారాయణ, గొందేశి వెంకటరమణారెడ్డి, సిరట్ల వాసు తదితరులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన

పెదగంట్యాడ: ములకలపల్లి ప్రకాష్ సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో కిమ్స్ ఐకాన్ ఆస్పత్రి సౌజన్యంతో పెదగంట్యాడలో శనివారం నిర్వహించిన నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. రోగులను డాక్టర్ ఎంఎస్ఎల్ రాజు పరీక్షించి, ఉచితంగా మందులు అందజేశారు. శస్త్ర చికిత్సలు చేయించుకున్న వారిని పరీక్షించి, పలు సూచనలు చేశారు. అనంతరం రోగులకు న్యూపోర్టు ట్రాఫిక్ ఎస్ఐ రాజు చేతుల మీదుగా పండ్లు పంపిణీ చేశారు. పెద్దాడ శ్రీను, యల్లబెల్లి వెంకటరావు, గంట్యాడ పైడికొండ తదితరులు పాల్గొన్నారు.



రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న న్యూపోర్టు ట్రాఫిక్ ఎస్ఐ రాజు

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్, డైరీలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

పెదగంట్యాడ: తల్లిదండ్రుల పేరుతో ట్రస్ట్‌ను ఏర్పాటు చేసి, సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. జీఏఆర్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు గొందేశి అప్పలరెడ్డి, చైర్మన్ శ్రీదేవి ఆధ్వర్యంలో రూపొందించిన కొత్త సంవత్సరం క్యాలెండర్, డైరీలను స్థానిక బీసీ రోడ్డులోని టీఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో శనివారం ఆయన ఆవిష్కరించారు. గౌతమ్‌రెడ్డి, పృథ్వీ కృష్ణారెడ్డి, ప్రసాద్‌రెడ్డి, గొందేశి రమణారెడ్డి, పిట్టా రెడ్డి, అప్పలరెడ్డి, మంజుల, రామలక్ష్మి పాల్గొన్నారు.

ఏయూలో చైతన్య కళాశాల క్యాలెండర్..

గాజువాక: చైతన్య డిగ్రీ, పీజీ మహిళా కళాశాల క్యాలెండర్‌ను ఏయూ వీసీ ప్రసాదరెడ్డి ఆవిష్కరించారు. ప్రతీ రోజుకు ఒక విశిష్టతను వివరిస్తూ క్యాలెండర్‌ను రూపొందించడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. కళాశాల కరస్పాండెంట్ విజయలక్ష్మి, ప్రిన్సిపాల్ చంద్ర మహాలక్ష్మి, డైరెక్టర్ కృష్ణ కుమారి తదితరులు పాల్గొన్నారు.

'పోరాట యోధుడు కందుల'

కూర్మన్నపాలెం: దళిత హక్కుల సాధన కోసం నిరంతరం కృషి చేసిన పోరాట యోధుడు కందుల ఆనందరావు అని ఏబీడీఆర్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మాటూరి శ్రీనివాసరావు అన్నారు. దళిత ఉద్యమ నేత, ఏబీడీఆర్ఎఫ్ వ్యవస్థాపకుడు ఆనందరావు వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో అప్పారావు, శ్రీను, ముత్యాలరావు, మాటూరి రత్నకుమారి, పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

బాలికను మోసం చేసిన వ్యక్తిపై కేసు నమోదు

కూర్మన్నపాలెం: ప్రేమ పేరిట యువతిని మోసం చేసిన వ్యక్తిపై దువ్వాడ పోలీస్‌స్టేషన్‌లో శనివారం కేసు నమోదైంది. దువ్వాడ సీఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. దేవాడ దరి దాసరిపేటలో నివాసముంటున్న ఓ జంట కూలి పనులు చేసుకుంటూ, తన ఇద్దరు కుమార్తెలను పోషించుకుంటున్నారు. రెండో కుమార్తె ఇస్లాంపేటలో జూనియర్ కళాశాలలో చదువుతోంది. ఆమెను పాలవలస దరి పిట్టవానిపాలెం ప్రాంతానికి చెందిన అదపురెడ్డి కిశోర్(23) ప్రేమిస్తున్నానని నమ్మబలికి ఆమెకు దగ్గరయ్యాడు. ఆరు నెలలుగా మైనర్ బాలిక పెళ్లి చేసుకోమని అడుగుతుండడంతో పరారయ్యాడు. ప్రస్తుతం బాలిక 7 నెలల గర్భవతి కావడంతో, ఆమె తల్లిదండ్రులు దువ్వాడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో అదపురెడ్డి కిశోర్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. పరారీలో ఉన్న అతడి కోసం గాలిస్తున్నారు.

స్టీల్‌ప్లాంట్ ఉద్యోగికి వీడ్కోలు



ఉక్కు భద్రతా విభాగం ఉద్యోగిని సత్కరిస్తున్న రాజశేఖర్, అధికారులు

ఉక్కునగరం: స్టీల్ ప్లాంట్ భద్రతా విభాగం సీనియర్ ఆర్టిస్ట్ ఇమాన్యుయెల్‌కు శనివారం ఘన వీడ్కోలు పలికారు. ఉక్కు భద్రతా విభాగంలో జరిగిన కార్యక్రమంలో విభాగం అధికారులు, కార్మిక నాయకుడు మంత్రి రాజశేఖర్ తదితరులు పాల్గొని, ఇమాన్యుయెల్ దంపతులను సత్కరించారు. విభాగాధిపతి రౌత్, అధికారులు రాజేంద్ర, రామ్‌ప్రసాద్, ఎస్. ప్రసాద్, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

• ఈ పాదం.. దివ్యపాదం



త్రిభువనాలను పాలించే శ్రీనివాసుని దివ్య మోహనరూపం అపురూపం. లక్ష్మీవల్లభుడైన స్వామికి అలంకరించే ఆభరణాలు అంతే ప్రత్యేకం. శిరస్సు నుంచి పాదాల వరకు ప్రతీ అలంకారమూ నేత్రపర్వమే. ఈ నెల 2న ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా షీలానగర్‌లోని ఎస్టీబీఎల్ సినీవరల్డ్‌లో ఎస్వీఎస్ సేవా సమితితో కలిసి ఏర్పాటు చేస్తున్న స్వామి ఉత్తర ద్వారదర్శనం, సాయంత్రం నిర్వహించే కల్యాణోత్సవానికి అందుకు అనుగుణంగానే అన్నీ సిద్ధమవుతున్నాయి. వేంకటేశ్వరస్వామికి కిరీటం, శంఖం, చక్రం, కటి, వరదహస్తం, నాగాభరణాలు, హృదయ లక్ష్మీదేవి, మకర కంఠహారం, తులసిమాల,



5వరుసల కాసులపేరు, సాలగ్రామం, వడ్డాణం, భుజకీర్తులు, హారాలు ఇప్పటికే సిద్ధం కాగా.. ఈ ఏడాది ప్రత్యేకంగా శ్రీవారి పాదాలను తయారు చేయిస్తున్నారు. పదేళ్ళుగా స్వామికి ఆభరణాలు చేస్తున్న తెనాలికి చెందిన ఆభరణాల శిల్పి అక్కల రామలింగేశ్వర కుమార్ చేతిలోనే ఈ పాదాలు కూడా రూపుదిద్దుకుంటున్నాయి. బంగారు తాపడంపై రాళ్లు పొదిగిన శ్రీవారి పాదాలను స్వామికి అలంకరించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. - అక్కిరెడ్డిపాలెం

నేత్రపర్వంగా పగల్‌పత్తు ఉత్సవాలు



స్వామికి తిరువీధి నిర్వహిస్తున్న ప్రధానార్చకుడు, సిబ్బంది

సింహాచలం: సింహగిరిపై పగల్‌పత్తు ఉత్సవాలను తొమ్మిదో రోజు శనివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి బేడా మండపంలో తిరువీధి నిర్వహించారు. గోదాదేవి సన్నిధిలో ధనుర్మాస పూజలు చేశారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు తదితరులు ఈ పూజలను నిర్వహించారు. పెందుర్తి వెంకటాద్రిపై కొలువుదీరిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో, సింహాచలం దేవస్థానానికి చెందిన వెంకన్న ఆలయంలో ధనుర్మాస పూజలను ఘనంగా నిర్వహించారు. తిరుప్పావై సేవాకాలాన్ని శాస్త్రోక్తంగా జరిపారు.

అప్పన్న అన్నప్రసాదానికి విరాళాలు

సింహాచలం: అప్పన్న శాశ్వత అన్నప్రసాద పథకానికి శనివారం పలువురు దాతలు విరాళాలు అందజేశారు. ఎన్ఏడీ కొత్తరోడ్డు ప్రాంతానికి చెందిన కె.సంతోష్ లక్ష రూపాయలను చెక్కు రూపంలో సింహగిరిపై మే ఐ హెల్ప్‌యూ కేంద్రంలో ఏఈవో ఆనంద్‌కుమార్‌కు అందజేశారు. కె.సత్యదేవ్ అనే దాత లక్ష 116 రూపాయల విరాళాన్ని నగదు రూపంలో ఏఈవో శ్రీనివాసరావుకు అందించారు. ఒడిశాలోని బరంపురానికి చెందిన బి.జగ్గారెడ్డి లక్ష 1,116 రూపాయల విరాళాన్ని అన్నదాన విభాగం సూపరింటెండెంట్ పాలూరి నరసింగరావుకు అందజేశారు. దేవస్థానం పీఆర్వోలు సునీల్, నాయుడు పాల్గొన్నారు.

శ్రీనివాసుని సన్నిధిలో అన్న సమారాధన

పెదగంట్యాడ: జీవీఎంసీ 65వ వార్డు వాంబే కాలనీలో కొలువుదీరిన వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో శనివారం అన్న సమారాధన నిర్వహించారు. అనకాపల్లి జిల్లా యర్రవరానికి చెందిన అగ్గా అప్పారావు, వరహాలమ్మ దంపతులు, హనుమంతరావు, లక్ష్మీ దంపతుల ఆర్థిక సాయంతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని వరాహ లక్ష్మీనరసింహస్వామి ఆలయ ట్రస్ట్‌బోర్డు సభ్యుడు దొడ్డి రమణ ప్రారంభించారు. భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. కార్యక్రమంలో మంత్రి మంజుల, పెంటకోట పైడిరాజు, రమణాజీ, భాను, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న రమణ

శ్రీవారి కల్యాణానికి మిజోరాం గవర్నర్‌కు ఆహ్వానం

అక్కిరెడ్డిపాలెం: జనవరి 2న వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని ఎస్టీబీఎల్ సినీ వరల్డ్ వద్ద సాయంత్రం జరిపించనున్న శ్రీవారి కల్యాణ మహోత్సవానికి మిజోరాం గవర్నర్ కంభంపాటి హరిబాబు దంపతులను నిర్వాహకులు ఆహ్వానించారు. ఎస్టీబీఎల్ ప్రాజెక్ట్స్ అధినేత గుత్తికొండ బాలాజీ విశాఖలోని గవర్నర్ నివాసంలో శనివారం వారిని కలిసి, ఆహ్వాన పత్రం అందజేశారు.



హరిబాబు దంపతులకు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న బాలాజీ